సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 13 । జూలై । 2024



ప్రతి కార్యకర్తను కాపాడుకుంటాం

ప్రతి కార్యకర్తను కాపాడుకుంటామని, అధైర్యపడొద్దని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. 8లో



కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

విశాఖ బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. 8లో



అప్పన్నకు ఆర్జితసేవలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. అనంతరం గరుడసేవ వైభవంగా జరిగింది. 8లో

న్యూస్‌రీల్

జిల్లా సమాఖ్య భవన నిర్మాణం వేగవంతం

- ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : జిల్లా సమాఖ్య భవన నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఐటీడీఏ పీవో అభిషేక్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఉప్పు కర్మాగారం సమీపంలో నిర్మిస్తున్న జిల్లా సమాఖ్య భవన నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. భవన నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. స్వయంసహాయక సంఘాలను బలోపేతం చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన జిల్లా సమాఖ్య కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. డీఆర్డీఏ పీడీ మురళి, జిల్లా సమాఖ్య సభ్యులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

దూర విద్య సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

చింతపల్లిరూరల్: గుంటూరు ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి దూర విద్య ద్వారా యువతీయువకులకు సర్టిఫికెట్ కోర్సులను అందించనున్నామని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ అప్పల స్వామి తెలిపారు. తేనెటీగల పెంపకం, చిరుధాన్యాల ఉత్పత్తి మరియు ప్రాసెసింగ్, పట్టుపురుగుల పెంపకం వంటి విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఎనిమిది వారాల పాటు ఇచ్చే ఈ శిక్షణకు ఆసక్తి గల యువతీయువకులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఒకే సారి ఒకటి కంటే ఎక్కువ కోర్సుల్లో శిక్షణ పొందవచ్చన్నారు. ఒక్కో కోర్సుకు రూ.1500 చొప్పున ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. అభ్యర్థికి కచ్చితంగా కంప్యూటర్,ల్యాప్‌టాప్ లేదా స్మార్ట్ ఫోన్ ఉండాలన్నారు.జూమ్ ద్వారా అభ్యర్థులకు పాఠాలు బోధిస్తారని,ప్రతి కోర్సుకు ఏడు ఆన్‌లైన్ పాఠలు,ఒక ప్రాక్టికల్ క్లాస్ ఉంటుందని వివరించారు. కోర్సు పూర్తయిన తర్వాత ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్ అందిస్తామన్నారు. www.angrau.ac.in నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మరిన్నివివరాలకు 8008788776 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

పెరుగుతున్న గోదావరి నీటి మట్టం

దేవీపట్నం: గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు కొండవాగుల ద్వారా చేరుతున్న వరద నీరు కారణంగా దేవీపట్నం మండలం పోశమ్మ గండి వద్ద గోదావరి నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. అమ్మవారి ఆలయం వద్ద రహదారిపైకి వరద నీరు చేరింది. ఇదే విధంగా పెరుగుదల కొనసాగితే రెండు రోజుల్లో అమ్మ వారి ఆలయంలోకి వరద నీరు చేరే అవకాశం ఉంది. దీంతో అమ్మ వారి ఆలయంలో గల ఆరు హుండీల్లో ఆదాయాన్ని శనివారం ఉదయం 7 గంటలకు దేవదాయ శాఖ అధికారులు సమక్షంలో లెక్కింపు నిర్వహించనున్నట్టు ఆలయం సిబ్బంది తెలిపారు.

ఫోర్‌బై కెనాల్‌లో పడి యువకుడి గల్లంతు



మురళీకృష్ణ (ఫైల్)

మోతుగూడెం: మోతుగూడెం పంచాయతీ పరిధిలోని ఉన్న ఫోర్‌బై కెనాల్‌లో పడి అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరు గ్రామానికి చెందిన మురళీకృష్ణ(24) అనే యువకుడు శుక్రవారం గల్లంతయ్యాడు. ఐదుగురు స్నేహితులతో కలిసి ఇక్కడకు విహార యాత్రకు వచ్చాడు. సాయంత్రం పవర్ కెనాల్ పుష్ప షూట్ బ్రిడ్జి వద్ద ప్రమాదవశాత్తు కాలు జారి కెనాల్‌లో పడ్డాడని తోటి స్నేహితులు తెలిపారు. యువకుడు గల్లంతైన విషయం తెలియడంతో ఎస్ఐగోపాలరావు కేసు నమోదు చేశారు.

ఏవోబీలో విస్తృతంగా పోలీసుల తనిఖీలు

ముంచంగిపుట్టు: ఆంధ్ర,ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో శుక్రవారం పోలీసు బలగాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి. ముంచంగిపుట్టు మండల కేంద్రం నుంచి జోలాపుట్టు వెళ్లే మార్గంలో స్థానిక ఎస్ఐ రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల బ్యాగులు,లగేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితుల వివరాలు సేకరించి,ప్రశ్నించి విడిచిపెట్టారు.ఈ సందర్భంగా ఎస్ఐ రవీంద్ర మాట్లాడుతూ గంజాయి రవాణా నియంత్రణలో భాగంగా ఆంధ్ర,ఒడిశా సరిహద్దులో రాకపోకలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు చెప్పారు. రాత్రిపూట పెట్రోలింగ్ చేస్తున్నామని,గంజాయి రవాణకు అడ్డుకట్ట వేసేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గిరిజన యువత గంజాయి జోలికి వెళ్లకుండా, ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిరిజన రైతులు సైతం ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని ఆయన కోరారు.

ఫ్రూట్ ఫుల్ లాభాలు

- భారీగా పనస, పైనాపిల్, సీతాఫలాల దిగుబడులు
- ఘాట్‌రోడ్డులో జోరందుకున్న అమ్మకాలు
- మైదాన ప్రాంతాలకు భారీగా రవాణా
- రిటైల్ అమ్మకాలకు ఆదరణ



విక్రయానికి సిద్ధంగా ఉన్న పనస, పైనాపిల్, సీతాఫలాలు



వంట్లమామిడిలో రిటైల్‌గా అమ్ముతున్న పనస, పైనాపిల్, సీతాఫలాలు

సాక్షి,పాడేరు: కమ్మని రుచుల గల పనస, పైనాపిల్, సీతాఫలాల విక్రయాలకు పాడేరు ఘాట్ రోడ్డు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పండ్ల అమ్మకాలతో ఈ రోడ్డులోని రాజాపురం, 12వ మైలురాయి జంక్షన్, వంట్లమామిడి ప్రాంతాలు సందడిగా మారాయి. గత రెండు నెలల నుంచి పనస,పైనాపిల్ పండ్లు భారీగా దిగుబడి కాగా, తాజాగా సీతాఫలాలు కూడా అమ్మకాలు ప్రారంభం కావడంతో ఈ మూడు ఫలాలను మైదాన ప్రాంతాలకు వ్యాపారులు భారీగా తరలిస్తున్నారు. రిటైల్‌గాను అమ్మకాలు జోరందుకున్నాయి. ఈ దారి వెంబడి ప్రయాణించే ప్రయాణికులు,దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు ఈ మధుర ఫలాలను కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఘాట్ రోడ్డులో పండ్ల దుకాణాలు నిత్యం సందడిగా ఉంటున్నాయి. గిరిజన రైతులు, వ్యాపారులకు మంచి లాభాలు వస్తున్నాయి.

ఏప్రిల్ నెలాఖరు నుంచి పనసపండ్లు దిగుబడి రావడంతో అప్పటి నుంచి ఈ పండ్ల అమ్మకాలు భారీగా జరిగాయి. ఈ ప్రాంతంలోని పలు పంచాయతీలకు చెందిన గిరిజనులు పనస పండ్లను విక్రయించి మంచి లాభాలు పొందుతున్నారు. రూ.100నుంచి రూ.150 ధరతో ఒక్కో పండును విక్రయిస్తున్నారు. దీంతో రోజువారి కనీసం రూ.1000 వరకు ఆదాయం పొందుతున్నారు. జూన్ మొదటి వారం నుంచి పైనాపిల్ దిగుబడికి రావడంతో వీటి అమ్మకాలు కూడా జోరందుకున్నాయి. వంట్లమామిడి, సలుగు, దేవాపురం, మోదాపల్లి, అయినాడ పంచాయతీల పరిధిలో 600 ఎకరాల విస్తీర్ణంలో పైనాపిల్ తోటలు ఉన్నాయి.ఈఏడాది కూడా కాపు ఆశాజనకంగా ఉండడంతో వాటి అమ్మకాల ద్వారా ప్రతి గిరిజన రైతు రూ.20వేల వరకు ఆదాయం లభించింది. మరో నెల రోజుల వరకు వీటి అమ్మకాలు ఉంటాయి.అలాగే సీతాఫలాలకు కూడా ఈప్రాంతం పేరొందింది. పాడేరు, జి.మాడుగుల మండలాల్లో 1,250 ఎకరాల్లో గిరిజన రైతుల సీతాఫలాల తోటలను సాగు చేస్తున్నారు.గత 10రోజుల నుంచి సీతాఫలాల దిగుబడులు ప్రారంభం కావడంతో వంట్లమామిడి,12వ మైలురాయి జంక్షన్లలో బుట్టలతో రోజువారీఅమ్మకాలు జరుపుతున్నారు. పెద్ద బుట్ట పండ్లు రూ.700కు విక్రయిస్తున్నారు. మున్ముందు ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.ఈ మూడు ఫలాల అమ్మకాలతో పాడేరు ఘాట్‌రోడ్డులో సందడి వాతావరణం నెలకొంది.ప్రతి ఆది వారం వంట్లమామిడి సంతలో అన్ని పండ్ల వ్యాపారం రూ.లక్షల్లో జరుగుతోంది.





పైనాపిల్, పనస

పైనాపిల్‌తో రూ.20 వేల ఆదాయం



ఈఏడాది పైనాపిల్ అమ్మకాల ద్వారా రూ.20వేల ఆదాయం పొందాను.ఎకరంన్నర మెట్ట భూమిలో పైనాపిల్‌ను పూర్వం నుంచి సాగు చేస్తున్నాం. ఒక్కో పండు రూ.15 చొప్పున విక్రయించాను. మైదాన ప్రాంత వ్యాపారులు గ్రామానికి వచ్చి కొనుగోలు చేశారు.పైనాపిల్ సాగు ఈసీజన్‌లో ఆర్థికంగా ఆదుకుంది.

– కొండపల్లి చంద్రమ్మ, పైనాపిల్ రైతు, పూలబంద, పాడేరు మండలం

సీతాఫలాల విక్రయాలతో లాభాలు



సీతాఫలాల దిగుబడులు ప్రారంభమయ్యాయి.గత ఏడాది వలే చెట్లకు కాపు బాగుంది.పక్వానికి వచ్చిన కాయలను సేకరించి గత వారం రోజుల నుంచి 12వమైలురాయి జంక్షన్‌లో వ్యాపారులకు విక్రయించాను.బుట్ట పండ్లకు రూ.700 చొప్పున ధర లభించింది.గత ఏడాది సీతాఫలాల పంట ద్వారా రూ.25వేల ఆదాయం వచ్చింది.

– వేమల లింగంరాజు, పూలబంద, వంట్లమామిడి పంచాయతీ, పాడేరు.

ప్రజా సమస్యల పరిష్కార బాధ్యత అధికారులదే

కలెక్టర్ దినేష్‌కుమార్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



స్వయం సహాయక సంఘాల సభ్యులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు : ఐటీడీఏ కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(మీకోసం)లో వచ్చిన సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత శాఖల అధికారులదేనని కలెక్టర్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 117 అర్జీలను జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట, ఐటీడీఏ పీవో అభిషేక్, డీఆర్వో పద్మావతితో కలిసి ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత వారం జిల్లా వ్యాప్తంగా 310 ఫిర్యాదులు వచ్చాయని వీటిలో 86 పరిష్కరించామని చెప్పారు. మిగిలిన 224 ఫిర్యాదులను కూడా పరిశీలించిన త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, టీడబ్ల్యూ డీడీ కొండలరావు, ఐటీడీఏ ఏవో హేమలత, ఎస్‌డీసీ శర్మ, డీఎంహెచ్‌వో డాక్టర్ జమల్‌బాషా, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీ సభ్యులకు వ్యక్తిగత యూనిట్లు

స్వయం సహాయక సంఘాల సభ్యులకు వ్యక్తిగత స్వయం ఉపాధి యూనిట్లను మంజూరు చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో అరకులోయ మండలానికి చెందిన 38 స్వయం సహాయక సంఘాలకు రూ.2,70,90,000 బ్యాంకు లింకేజీ చెక్కులను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళలు.. కలెక్టర్‌తో మాట్లాడుతూ కుట్టు మిషన్లు ఏర్పాటు చేసుకున్నామని, వారపు సంతల్లో చిరు వ్యాపారాలు చేస్తున్నామని వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యక్తిగత పథకాలు ప్రవేశపెట్టిందని, అటువంటి పథకాలను మహిళలకు మంజూరు చేయాలని డీఆర్‌డీఏ పీడీని ఆదేశించారు. అంతకుముందు ఐటీడీఏ ఆవరణలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయాల విక్రయ కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట, ఐటీడీఏ పీవో అభిషేక్,డీఆర్‌డీఏ పీడీ మురళి తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రీషెడ్యూల్



తాటిచెట్లపాలెం(విశాఖ): పలు రైళ్లు ఆలస్యంగా చేరుకోవడంతో.. ఆయా స్టేషన్ల నుంచి బయలుదేరే రైళ్లను రీషెడ్యూల్ చేసినట్లు వాల్తేర డివిజన్ అధికారులు తెలిపారు. షాలిమర్–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12841) కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ సుమారు 3 గంటలు ఆలస్యంగా శుక్రవారం సాయంత్రం 6.20 గంటలకు, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–భువనేశ్వర్(12829) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు గంటన్నర ఆలస్యంగా ఉదయం 11.30 గంటలకు బయలుదేరింది.

కొద్దిసేపు పనిచేయని రైల్వే రిజర్వేషన్ కౌంటర్లు

విశాఖపట్నం రైల్వే రిజర్వేషన్ కౌంటర్లు శుక్రవారం కొద్దిసేపు పనిచేయలేదు. రిజర్వేషన్ సిస్టం (క్రిస్) కోల్‌కతాలో పలు నిర్వహణ, మార్పులను చేపట్టడంతో సుమారు అరగంట సేపు రిజర్వేషన్ సిస్టంలు పనిచేయలేదని అధికారులు తెలిపారు.

హామీలన్నీ అమలు చేయాల్సిందే

పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, పక్కన వైఎస్సార్‌సీపీ నాయకులు

పాడేరు : ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీను కూటమి ప్రభుత్వం అమలు చేయాల్సిందేనని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసే వరకూ ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాడుతుందని తెలిపారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఇంట్లో ఎంతమంది బడికి వెళ్లే పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం పేరుతో రూ.15వేల చొప్పున ఇస్తామని ఎన్నికలకు ముందు చెప్పారన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీను విస్మరిస్తూ ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా కేవలం రూ.15 వేలు మాత్రమే తల్లి ఖాతాలో జమచేస్తామని జీవో జారీ చేయడం మోసచేయడమేనన్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఏటా విద్య సంవత్సరం ప్రారంభం నాటికే అమ్మఒడి పథకం ద్వారా నేరుగా తల్లుల ఖాతాల్లో నగదు జమా చేసేవారని గుర్తు చేశారు. కానీ పాఠశాలలు పునఃప్రారంభమై చాలా రోజులైనప్పటికీ ఇప్పుడున్న ప్రభుత్వం తల్లి వందనం పథకాన్ని అమలు చేయలేదని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే భవన నిర్మాణాల కోసం ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని ప్రకటించారని కానీ ఇప్పుడు టన్నుకు ఒక్కో చోట ఒక్కో రేటు నిర్ణయించి ప్రజలను నిలువునా దోచుకుంటున్నారని ఆరోపించారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన పోరాడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మంగ్లన్నదొర, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు గబ్బాడ చిట్టిబాబు, సర్పంచ్‌ల పోరం మండల అధ్యక్షుడు వనుగు బసవన్నదొర, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు కిల్లు కోటిబాబు నాయుడు, కూడా సురేష్‌కుమార్, సర్పంచ్‌లు వంతాల రాంబాబు, కుర్రబోయిన సన్నిబాబు, గొల్లోరి నీలకంఠం, సామేలి లక్ష్మణరావు, ఎంపీటీసీలు కుంతూరు నర్సింహమూర్తి, మాజీ సర్పంచ్‌లు శరభ సూర్యనారాయణ, ఎం.కన్నాపాత్రుడు, సీనియర్ నాయకులు రొబ్బా కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న పీవో సూరజ్‌గనోరే



హాజరైన ఉపాధ్యాయ సంఘాల నాయకులు

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. ఐటీడీఏ సమావేశపు హాలులో శుక్రవారం డీడీ జాన్‌రాజ్‌తో కలిసి ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఏజెన్సీలోని ప్రతి ఆశ్రమ పాఠశాలలో ఏఎన్ఎంను నియమించాలని, జీవో నంబర్ ఒకటి ప్రకారం అర్హులైన వారికి ఏజెన్సీ డీఈవోగా పదోన్నతి కల్పించాలని, 77 మంది సెకండ్ గ్రేడ్ టీచర్లకు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. కొంతమంది టీచర్లకు సీఎఫ్ఎంఎస్ సమస్యల వల్ల జీతాలు అందడం లేదని వారు పీవోకు తెలిపారు. ఖాళీ అయిన సబ్జెక్టు టీచర్ల పోస్టుల్లో ఎప్పటికప్పుడు ప్రమోషన్ల పై అర్హులైన వారిని నియమించాలన్నారు. అర్హులైన వారికి జూనియర్ లెక్చరర్లుగా ప్రమోషన్లు కల్పించాలని, ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, కొన్ని పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న నాడు –నేడు పనులు పూర్తి చేయించాలని కోరారు.

రాజవొమ్మంగి మండలం తాళ్లపాలెం ఆశ్రమ పాఠశాలను రాజవొమ్మంగిలో కలిపారని, తిరిగి తాళ్లపాలెం గ్రామంలోనే ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేయాలన్నారు. రంపచోడవరం మండలం పెద్దగెడ్డడ హైస్కూల్లో అదనపు తరగతి గదులు నిర్మించాలని కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు కె.రంగారావు, బి.మంగిరెడ్డి, కత్తుల ఆదిరెడ్డి, ఎం.కరుణ విలాస్, కె.సూరిబాబు, బి.కృష్ణ, వై.విల్సన్, ఎల్.వేణుగోపాల్, జి.భూషణం, కె.రాంబాబు, కె.ఆర్.పి.కుమార్, బి.ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. తన పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని సంఘం నాయకులకు పీవో హామీ ఇచ్చారు.

విద్యాప్రమాణాల మెరుగుకు కృషి

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, జెడ్పీచైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



అనంతగిరిలో పదోతరగతి విద్యార్థినులతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, జెడ్పీచైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



కొత్తభల్లుగుడ వసతి గృహంలో ఆహారపదార్థాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అనంతగిరి: ప్రాథమికస్థాయి నుంచి విద్యార్థుల విద్యాప్రమాణాల మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలికల–1 పాఠశాలను వారు శుక్రవారం తనిఖీ చేశారు. ముందుగా పదోతరగతి విద్యార్థినులతో కొంతసేపు మాట్లాడారు. హిందీ, ఆంగ్లం పుస్తకాలను చదివించారు. ఈ ఏడాది పుస్తకాలు, షూ, యూనిఫాం అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో పీఈటీ లేకపోవడంతో క్రీడలకు దూరంగా ఉంటున్నామని విద్యార్థినులు తెలపగా, ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. విద్యార్థినుల కోసం సిద్ధం చేస్తున్న ఆహారపదార్థాలను పరిశీలించి, మెనూ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శోభా హైమవతి, కోఆప్షన్ సభ్యుడు మదీనా, హెచ్ఎం మంగమ్మ, మెట్రిన్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

మెనూలో రాజీ పడొద్దు

అరకులోయ రూరల్: విద్యార్థులకు అందజేస్తున్న మెనూలో రాజీ పడవద్దని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తెలిపారు. మండలంలో కొత్తభల్లుగుడ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల వసతి గృహాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. వసతి గృహంలో విద్యార్థినులకు పెడుతున్న ఆహారపదార్థాలను పరిశీలించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొద్దిసేపు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వసతి గృహం పరిసరాలు పరిశుభ్రంగా ఉండేటట్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రామూర్తి, హెచ్ఎం పద్మవతి,డిప్యూటీ వార్డెన్ మోహిని పాల్గొన్నారు.

నేడు ఇంజినీరింగ్ వెబ్ ఆప్షన్ల మార్పిడికి అవకాశం

మురళీనగర్ (విశాఖ): ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి వెబ్ ఆప్షన్ల గడువు శుక్రవారంతో ముగిసింది. దీంతో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లోని హెల్ప్‌లైన్ కేంద్రానికి అత్యధిక సంఖ్యలో విద్యార్థులు వచ్చి వెబ్ ఆప్షన్లు పెట్టుకున్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కూడా నిర్వహించి వీరికి వెబ్ ఆప్షన్లు పెట్టుకోవడానికి సిబ్బంది సహకరించారు. వీరు తమ ఆప్షన్లను ఫ్రీజ్ చేశారు. శనివారం ఆప్షన్లు మార్చుకోవడానికి అవకాశం ఉందని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు సూచించారు. ఈనెల 16న సీట్లు కేటాయిస్తారు. 17నుంచి 22 తేదీ వరకు సెల్ఫ్ జాయినింగ్ రిపోర్టు ఆన్‌లైన్‌లో చేసి కాలేజీలకు ఆ రిపోర్టు సమర్పించాలని ఆయన చెప్పారు. ఇదిలా ఉండగా పాలిసెట్ ఆఖరి దశ కౌన్సెలింగ్ శుక్రవారం కొనసాగింది. విద్యార్థుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. పలువురు విద్యార్థులు పాలిటెక్నిక్ ప్రవేశాలకు సంబంధించి ఆప్షన్లు పెట్టుకున్నారు. శనివారంతో పాలిటెక్ వెబ్ ఆప్షన్ల గడువు ముగుస్తుంది.

వరదలను సమర్థంగా ఎదుర్కొంటాం

చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

కూనవరం: వరదల పట్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేదని, ఎలాంటి వరద పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కొంటామని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో వరద సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. జోనల్ అధికారులు పునరావాస కేంద్రాలకు తరచూ వెళ్లి అక్కడ మౌలిక వసతులను పరిశీలించాలని సూచించారు. మంచినీటి బోర్లు, సోలార్ లైట్లు, దోమతెరలు ఏ మేరకు అవసరం ఉంటాయో గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు. ప్రస్తుతం మండలానికి రెండు లాంచీలు చొప్పున కేటాయించామని, అవసరాన్ని బట్టి అదనంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. వరదల సమయంలో ఎన్‌జీవోల సేవలను వినియోగించుకుంటామని చెప్పారు. అనంతరం కొండ్రాజుపేట సచివాలయం పరిధిలో శబరి కొత్తగూడెం, చినార్కూరు సచివాలయం పరిధిలో శ్రీరామ్‌పురం, వెంకన్న గూడెం గ్రామాలను సందర్శించి అక్కడి ప్రజాప్రతినిధులు, ప్రజలతో మాట్లాడారు. రాబోవు వరదల తీవ్రత గురించి, పునరావాస కేంద్రాలలో కావలసిన ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. కోతులగుట్టలో ఉన్న వెలుగు కార్యాలయాన్ని సందర్శించి అక్కడ మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.వి. మురళీకృష్ణ, ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉండవల్లి గాంధీబాబు, ఎస్ఐ శ్రీనివాసరావు, ఎఫ్ఆర్ మోహిని విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


తీరప్రాంతంలో 'సాగర్ కవచ్'



విన్యాసాల్లో పాల్గొన్న నౌకలు

సింధియా(విశాఖ) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తీరప్రాంత భద్రతను అంచనా వేయడమే లక్ష్యంగా రెండు రోజులపాటు సాగర్‌కవచ్ నిర్వహించారు. ఈ వ్యాయామంలో ఇండియన్ నేవీ, ఇండియన్ కోస్ట్ గార్డ్, సీఐఎస్ఎఫ్, కస్టమ్స్, ఆర్పీఎఫ్, స్టేట్ పోలీస్, మెరైన్ పోలీస్, ఫిషరీస్, ఐబీ, పోర్ట్ అథారిటీస్ వంటి స్టేట్ ఏజెన్సీలు చురుగ్గా పాల్గొన్నాయి. తూర్పు నౌకాదళ కమాండ్ పరిధిలోని నేవల్, కోస్ట్‌గార్డ్ వైమానిక ఆస్తులు కాపడడమే ధ్యేయంగా వైమానిక నిఘా నిర్వహించిన ఈ వ్యాయామంలో భారత నౌకాదళ నౌకలు, కోస్ట్‌గార్డ్ నౌకలు పాల్గొని విన్యాసాలు ప్రదర్శించినట్లు నేవీ వర్గాలు తెలిపాయి.

ఇంకా ఎన్నాళ్లీ.. ఆర్థిక అబద్ధాలు



క్యాలెండర్లు మారుతున్నాయి.. దశాబ్దాలు గడుస్తున్నాయి.. కానీ మాట మాత్రం మారడం లేదు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు చర్వితచరణంగా ఒకే అబద్ధాన్ని వల్లె వేస్తూ విశాఖ ప్రజలను మొత్తంగా ఉత్తరాంధ్రను మోసం చేస్తూ వస్తున్నారు. విశాఖలో ఏ సదస్సు జరిగినా.. చంద్రబాబు నోటి వెంట వచ్చే మొదటి మాట.. ''వైజాగ్‌ను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తాను. ప్రపంచపటంలో నిలబెడతాను''. 30 ఏళ్లుగా నగరాన్ని ఆర్థిక రాజధానిగా మార్చేందుకే ప్రయత్నిస్తున్నారా సీఎం సార్ అంటూ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

- విశాఖపై అవ్యాజ ప్రేమ కురిపిస్తున్న చంద్రబాబు
- సీఎంగా ఉన్న ప్రతిసారీ విశాఖను ఆర్థిక రాజధాని చేస్తానంటూ ప్రగల్భాలు
- 1997 నుంచి ప్రతీసారీ అదే పాట..
- వైజాగ్‌లో కించిత్తు అభివృద్ధి కూడా చెయ్యని టీడీపీ సర్కారు
- మరోసారి విశాఖను ఫిన్‌టెక్ హబ్‌గా, ఆర్థిక రాజధానిగా చేస్తానంటూ గొప్పలు
- ఇకపై జాతీయ, అంతర్జాతీయ సదస్సులు అమరావతిలోనే..
- విశాఖ బ్రాండ్‌ను క్రమంగా తగ్గించేందుకు టీడీపీ సన్నాహాలు
- వైఎస్ జగన్ హయాంలో నిర్వహించిన సదస్సులతో అంతర్జాతీయ ఖ్యాతి

1997 హైదరాబాద్ రాజధానే అయినా.. విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తా..

1999 విశాఖపట్నం బ్యూటిఫుల్ సిటీ.. ఈ నగరాన్ని రాష్ట్రానికి ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేసి ప్రపంచ పటంలో పెడతా..

2014 వన్ సైడ్ సీ.. త్రీసైడ్స్ హిల్స్.. వైజాగ్ మోస్ట్ బ్యూటిఫుల్ సిటీ. ఆర్థిక రాజధానిగా, నాలెడ్జ్‌హబ్‌గా చేసి అంతర్జాతీయ సంస్థలను ఇక్కడికి తీసుకొస్తా..

2024 అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేసి.. విశాఖను ఆర్థిక రాజధానిగా, ఫిన్‌టెక్ హబ్‌గా మార్చేస్తా..

సాక్షి, విశాఖపట్నం : ఆర్థికాభివృద్ధి అంటే.. భారీభవంతులు నిర్మించడం మాత్రమే కాదు.. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం.. ప్రతిప్రాంతంలో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం.. సగటు వ్యక్తి చెంతకు పరిపాలన వ్యవస్థను తీసుకురావడం.. ఆహ్లాదాన్ని పంచి.. ఉపాధి అవకాశాలు కల్పించి.. ప్రతి ఒక్కరూ సామాజికంగా.. ఆర్థికంగా ఎదగడం. కానీ 1995 నుంచి వివిధ దఫాలుగా సీఎంగా బాధ్యతలు నిర్వర్తించిన చంద్రబాబు.. ఏ సంవత్సరం కూడా.. తాను చెప్పిన ఆర్థిక రాజధాని అబద్ధాన్ని నిజం చెయ్యాలన్న ఆలోచన మాత్రం ఏ కోశానా చెయ్యలేదు. కేవలం మాటలతోనే కోటలు కట్టేస్తున్నారే తప్ప.. వైజాగ్ అభివృద్ధి కోసం ఏనాడూ పాటుపడలేదు.

ఆర్థికంగా ఎప్పుడు అభివృద్ధి చేశారు?

ఎప్పుడూ ఆర్థిక రాజధానిగా చేస్తానని చెప్పడమే తప్ప..విశాఖపై చంద్రబాబు చూపించేది కేవలం కపట ప్రేమేనని ఆయన చూపించిన వివక్షే స్పష్టం చేస్తోంది. ఐటీ రంగాన్ని అభివృద్ధి చేస్తానని ప్రకటించిన చంద్రబాబు.. తొలుత హైదరాబాద్ పైనే దృష్టిసారించారు. కానీ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రుషికొండలో ఐటీసెజ్‌కు బాటలు వేసి అద్భుతంగా తీర్చిదిద్దారు. ఆయన మరణం తర్వాత ఐటీ కంపెనీలకు అందించే ప్రోత్సాహకాలపై తర్వాత ప్రభుత్వాలు క్రమేపీ శీతకన్ను వెయ్యడంతో చంద్రబాబు, లోకేష్ హయాంలో ఒక్కొక్కటిగా నిర్వీర్యమైపోయాయి. 1999లో రూ.284 కోట్లుగా ఉన్న ఐటీ ఎగుమతులు టర్నోవర్ 2009 నాటికి రూ.32,509 కోట్లకు పెరిగింది. 2010–11లో ఐటీ ఉత్పత్తుల విలువ రూ.3,600 కోట్లకు దిగజారిపోయింది. దిగ్గజ కంపెనీలు కూడా రాలేదు. మరి ఆర్థిక రాజధానిగా విశాఖను ఏం అభివృద్ధి చేసినట్లని ఐటీ ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు.



విశాఖను విస్మరించారిలా...

ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా వేల కోట్ల రూపాయల భూ కుంభకోణంతో టీడీపీ ప్రభుత్వం విశాఖ పరువు తీసింది. టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు సాగరతీరాన్ని, భీమిలి, మధురవాడ ప్రాంతాలను చెరబట్టారు. తమ పార్టీ నేతలే రూ.వేల కోట్ల భూములు దోచుకున్నారంటూ అప్పటి మంత్రి, ప్రస్తుత స్పీకర్ అయ్యన్నపాత్రుడే సిట్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో విశాఖలో స్థలం కొనాలంటే భయపడే స్థాయికి తీసుకొచ్చారు.

- మెట్రో రైలు ప్రాజెక్టును తీసుకొస్తామని చెప్పిన చంద్రబాబు.. కేంద్రానికి డీపీఆర్ ఇచ్చేశామంటూ అబద్ధాన్ని ప్రచారం చేశారు. కానీ.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మెట్రో డీపీఆర్‌ని కేంద్రానికి పంపించింది.
- విశాఖను ఆర్థికరాజధానిగా చెయ్యాలని నిజంగా టీడీపీకి ఉంటే.. ఎయిమ్స్ విశాఖలోనే ఏర్పాటు చేసేవారు. కానీ అమరావతిలో భూములు కేటాయించి నిర్మించారు.
- చివరికి ఈ దఫాలోనూ అదే పల్లవి అందుకున్న చంద్రబాబు చివరిగా చెప్పిన మాట అందర్నీ విస్మయానికి గురి చేస్తోంది. విశాఖ నగరం అంటే.. ప్రపంచస్థాయి సదస్సులకు కేరాఫ్‌గా మారింది. జీ20, గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023తో పాటు విభిన్న అంతర్జాతీయ సదస్సులు జరిగాయి. ఇకపై అమరావతిలో గ్లోబల్ సమ్మిట్స్ నిర్వహిస్తామంటూ రెండు రోజుల క్రితం మెడ్‌టెక్ జోన్‌లో జరిగిన సదస్సులో చంద్రబాబు చెప్పడం చూస్తే.. విశాఖలో ఇకపై అంతర్జాతీయ సదస్సులు జరగబోవని స్పష్టమవుతోంది.
- వైఎస్సార్‌సీపీ హయాంలో విశాఖ నగరం అద్భుతంగా రూపుదిద్దుకుంది. అంతర్జాతీయ సంస్థలు ఇన్ఫోసిస్, డబ్ల్యూఎన్ఎస్, యాక్సెంచర్, రాండ్‌స్టాడ్ మొదలైన దిగ్గజ ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలు విశాఖకు క్యూ కట్టాయి. జీఐఎస్–2023లో 46 దేశాల ప్రతినిధులు, దిగ్గజ పారిశ్రామికవేత్తలు హాజరై విశాఖ అభివృద్ధిని ప్రపంచ దేశాలకు పరిచయం చేశారు. ఇలా అన్ని రంగాల్లోనూ విశాఖను ముందుకు తీసుకెళ్తూ.. కార్యనిర్వాహక రాజధానిగా అభివృద్ధి చేసేందుకు ఐదేళ్లలోనే అడుగులు వేసింది. కానీ మూడు దశాబ్దాలుగా ఆర్థిక రాజధాని చేస్తామంటూ బీరాలు పలుకుతున్న చంద్రబాబు ప్రభుత్వం మాత్రం వైజాగ్ అంటే నిరంతరం ఏదో ఒక రకంగా వివక్ష చూపిస్తూనే ఉంది.

అప్పన్నకు వైభవంగా ఆర్జితసేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి విష్వక్సేన పూజ,పుణ్యాహవచనం నిర్వహించారు. తదుపరి సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టింపజేసి అష్టోత్తరంపూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

ప్రతి కార్యకర్తను కాపాడుకుంటాం

- ఎమ్మెల్యే, ఎంపీ గెలుపుపై విజయోత్సవ ర్యాలీ
- దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులు
- ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంనకు సన్మానం
- తరలివచ్చిన ప్రజాప్రతినిధులు, నేతలు



విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మత్స్యలింగం, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, పార్టీ జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి తదితరులు



దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్ పర్సన్, పార్టీ జిల్లా అధ్యక్షురాలు



ఎమ్మెల్యే రేగం మత్స్యలింగను సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు

అనంతగిరి: ప్రతి కార్యకర్తలను కపాడుకుంటామని, అధైర్యపడొద్దు మేమున్నామని, వైఎస్సార్‌సీపీ పార్టీ అల్లూరి జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి అరకు అసెంబ్లీ, ఎంపీ స్థానాల్లో విజయకేతనం ఎగరవేయడంతో విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ముందుగా జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతికి, ఎంపీపీ శెట్టినీలవేణి, మండల పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి, నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి మండల కేంద్రం మీదుగా నినాదాలతో ర్యాలీ చేపట్టారు. అనంతరం మొండిజామిగుడ రోయల్ రిసార్ట్స్ వద్ద నిర్వహించిన విజయోత్సవ సభ, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోని జిల్లా పార్టీ అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మీ మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతం జగనన్న రుణం తీర్చుకుందని, పార్టీ అవిర్భావం నుంచి జగనన్న గిరిజనులు తోడుగా ఉన్నారన్నారు. అసెంబ్లీ, ఎంపీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేశారని, పేరుపేరునా ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోని అనేక సంక్షేమ పథకాలు ద్వారా గిరిజనుల అభ్యున్నతికి జగనన్న ప్రత్యేక కృషి చేశారన్నారు. నిరుపేదలకు గుర్తింపు కలిగిదంటే జగనన్నే కారణమన్నారు. జగనన్న గిరిజనుల పక్షపాతికి పనిచేశారని, గిరిజనుల చట్టాలను, గిరిజనులకు అండగా ఉండేందుకు ఎస్టీకమిషన్ ఏర్పాటుచేసిన ఏకైక దమ్మున్న నాయకుడిని కొనియాడారు. గతంలోని కనీస సౌకర్యాలకు నోచుకోని గ్రామాలు.. నేడు అభివృద్ధి పథంలోని నడుస్తున్నాయని, సచివాలయం వ్యవస్థ ప్రజలకు పాలన చేరువచేశారన్నారు.

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ... అత్యధిక మెజార్టీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. గిరిజనులకు హక్కులు, చట్టాలను కాపాడేందుకు అసెంబ్లీలోని గిరిజనులు గొంతుకనవుతానన్నారు. అరకు అభివృద్ధికి పెద్ద ఎత్తున కృషిచేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతానని, ప్రతి కార్యకర్త తలెత్తుకుని, తిరిగేలా పనిచేస్తానన్నారు. ముఖ్యంగా గిరిజనులకు ఆయువుపట్టులాంటి జీవో నంబర్3పై అసెంబ్లీ సాక్షిగా గిరిజనుల తరుపున పోరాటం చేసి, పునరుద్ధరణకు తనవంతుగా కృషిచేస్తానన్నారు. అనంతరం ఎంపీపీ శెట్టినీలవేణి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి ఆధ్వర్యంలోని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను సన్మానం చేశారు. జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర పెద్ద ఎత్తున సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వైస్ ఎంపీపీలు దూరు జయవర్ధిణి, ఉర్మ శకుంతల, మాజీ జడ్పీటీసీ దూరు గంగన్నదొర, ఎంపీటీసీలు మితుల, అశోక్, జయశ్రీ, సర్పంచ్లు పాగి అప్పారావు, సన్యాసిరావు, సింహాద్రి, పెంటమ్మ, వైఎస్సార్‌సీపీ పార్టీ ఉపాధ్యక్షులు సూర్యానారాయణ, మధుసూదన్, ప్రధాన కార్యదర్శులు శెట్టి లక్ష్మణ్‌రావు, దానియేలు, కన్వీనర్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ధారకొండ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ అనంతబాబు

సీలేరు: గూడెం కొత్తవీధి మండలం ధారకొండ ఘాట్‌లో ఉన్న ధారాలమ్మ అమ్మవారిని వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎమ్మెల్సీ అనంతబాబు శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనను ఆలయ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా అనంతబాబు అమ్మవారి గర్భాలయంకు వెళ్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. వారాహీ అమ్మవారి నవరాత్రులు జరుగుతుండటంతో పాటు ఆషాడ మాసం కావడంతో ప్రత్యేకంగా అమ్మవారిని ఎమ్మెల్సీ అనంతబాబు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ధారకొండ ఘాట్ రోడ్డులో పోలీసు బలగాలను మోహరించారు. సీఐ అప్పలనాయుడు, ఎస్సై జె.రామక్రిష్ణ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు

కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

అందుబాటులో ఐదు కొత్త గ్రూపులు : ప్రిన్సిపాల్ కృష్ణ

కొయ్యూరు: మండలంలోని మర్రిపాలెంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కొత్తగా ఐదు మేజర్, నాలుగు మైనర్ సబ్జక్టలను ప్రవేశపెట్టామని ప్రిన్సిపాల్ టి.కృష్ణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు.ఆసక్తి గల వారు ఈనెల 20తేదీ లోగా దరఖాస్తు చేయాలని కోరారు. ఇందులో భాగంగా మేజర్‌గా బీఎస్సీలో గణితం, ఫిజిక్స్ జువాలజీ, ఎకనామిక్స్, బీఏలో రసాయన శాస్త్రం, బోటనీ, పొలిటిక్స్ ఉంటుందని పేర్కొన్నారు. బీకామ్‌కు సంబంధించి కంప్యూటర్ అప్లికేషన్లు, మార్కెటింగ్ గ్రూపులు అందుబాటులోకి వచ్చినట్టు చెప్పారు. మొత్తం ఐదు గ్రూపులనుప్రవేశపెట్టారని పేర్కొన్నారు. కళాశాలను ఆనుకుని గిరిజన సంక్షేమ పోస్టుమెట్రిక్ బాలికల వసతిగృహం ఉందన్నారు. దరఖాస్తులు చేసేందుకు ఓఏఎండీసీ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. రిజిస్ట్రేషన్ల తరువాత వెబ్ ఆప్షన్ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9704080103 లేదా 9989465410 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతపల్లిరూరల్: చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలుపుతున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ వనుము ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవి లైన్లు మరమ్మతుల కోసం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ఆయా ప్రాంత విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం


డాబాగార్డెన్స్(విశాఖ) : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. రూ.500 చెల్లిస్తే పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సాప్ చేయాలి.

'మా భూములు మాకే దక్కాలి'

- సెంట్రల్ జైలు నిర్మాణానికి ఇవ్వం
- ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ముందు మొరపెట్టుకున్న వంతాలగుమ్మి గ్రామస్తులు



ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు వినతిపత్రం ఇస్తున్న వంతాలగుమ్మి గ్రామస్తులు

పాడేరు : ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న తమ వ్యవసాయ భూముల్లో ప్రభుత్వ భవనాల నిర్మాణాలు జరగకుండా చూడాలని మండలంలోని గుత్తులపుట్టు పంచాయతీ వంతాలగుమ్మి గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

ఈ మేరకు వారంతా శుక్రవారం పాడేరులో ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. తరాలుగా తమ పూర్వీకులు వంతాలగుమ్మి పరిసర ప్రాంతాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే తామంత కొండకుమ్మర్లు జాబితాలో ఉండడంతో బీసీ కులస్తులుగా పరిగణించి పట్టాలకు నోచుకోలేదన్నారు. అయితే ఇటీవల కొంతమంది అధికారులమని చెప్పి ఆయా భూముల్లో సర్వే చేస్తున్నారన్నారు. సెంట్రల్ జైలు నిర్మాణం కోసం సర్వే చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారన్నారు. దీనిపై స్పందించిన పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్రరాజు మాట్లాడుతూ ఈ విషయాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు.